నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ ఆదివారం 20 అక్టోబర్ 2024 | ADILABAD NIRMAL

ఈవీఎం గోదాం తనిఖీ

ఎదులాపురం, అక్టోబర్ 19 : ప్రతి నెలా తనిఖీలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో గల ఈవీఎం గోదాంను శనివారం కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. ఆయన వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు.

ఈవీఎం గోదాంను తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

రిమ్స్ ఆసుపత్రిలో భద్రత కట్టుదిట్టం

ఎదులాపురం, అక్టోబర్ 19 : ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఆసుపత్రిలో సందర్శకులు ప్రమాదకర వస్తువులు లోనికి తీసుకెళ్లకుండా తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. కోల్ కతాలో జూనియర్ వైద్యురాలిపై లైంగికదాడి అనంతరం ఆసుపత్రుల్లో భద్రతను పెంచాలన్న వైద్యశాఖ ఆదేశాల మేరకు రిమ్స్ యజమాన్యం చర్యలు ప్రారంభించింది. రోగులను పరామర్శించేందుకు వచ్చే సందర్శకులు, సహాయకులను భద్రతా సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.

సందర్శకులను తనిఖీ చేస్తున్న భద్రతా సిబ్బంది

పత్తి కొనుగోళ్లకు రెడీ

- 23 నుంచి సీసీఐ ఆధ్వర్యంలో సేకరణ
- తేమ సమస్య పరిష్కారం అయ్యేనా?
- 8 నుంచి 12 శాతం ఉంటేనే కొనుగోలు

ఆదిలాబాద్, అక్టోబర్ 19(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో పత్తి కొనుగోళ్లకు అధికారులు తేదీని ఖరారు చేశారు. ఈ నెల 23 నుంచి ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో కొనుగోళ్లను ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షి షా ఓ ప్రకటనలో తెలిపారు. మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521 ఉండగా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఆధ్వర్యంలో పంట సేకరణ జరుపనున్నారు. ఈ ఏడాది వానకాలంలో 4,33,547 ఎకరాల్లో రైతులు పత్తిని సాగు చేశారు. సీజన్‌లో జూన్ మొదటివారంలో విత్తనాలు వేస్తారు. జనవరి వరకు పంట దిగుబడులు పూర్తి అవుతుండగా.. ఇప్పటికే జిల్లాలో రైతులు పత్తిని తీసి ఇండ్లలో నిల్వ చేసుకుని ప్రభుత్వ కొనుగోళ్ల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ ఏడాది సాగుకు వాతావరణం, వర్షాలు సహకరించడం, పురుగులు, తెగుళ్ల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. ఎకరాకు పది క్వింటాళ్ల వరకు పంట చేతికొచ్చే అవకాశాలు ఉండగా.. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది క్వింటాలుకు రూ.7,521 మద్దతు ధర ప్రకటించింది. జిల్లా వ్యాప్తంగా 32 లక్షల క్వింటాళ్ల పంట విక్రయానికి వస్తుందని అంచనా వేశారు. పత్తి కొనుగోళ్లకు సంబంధించి అధికారులు ఇటీవల సీసీఐ, ప్రైవేటు వ్యాపారులు, టాన్స్‌పోర్టర్లతో సమావేశం నిర్వహించారు. పత్తి కొనుగోళ్లలో సమస్యల పరిష్కారానికి వ్యవసాయ, మార్కెటింగ్, సీసీఐ, తునికలు, కొలతలు, రవాణా శాఖ కార్యాలయాలకు చెందిన అధికారుల ఫోన్ నంబర్లను అందుబాటులోకి తీసుకొచ్చారు.

ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో పత్తి లోడ్‌లతో వచ్చిన వాహనాలు(ఫైల్)

తేమ సమస్య పరిష్కారం అయ్యేనా?

సీసీఐ ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లో రెండు, బోథ్, సోనాల, నేరడిగొండ, పొచ్చెర, ఇంద్రవెల్లి, నార్నూర్, ఇచ్చోడ, గాదిగూడ, గుడిహత్నూర్, సిరికొండ, జైనథ్, బేలలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. పంటలో తేమ 8 నుంచి 12 శాతం వరకు ఉంటేనే కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులు పత్తిని ఎండపెట్టి తీసుకురావాలని సూచిస్తున్నారు. తేమ విషయంలో ఐకేపీ సిబ్బందికి ఇటీవల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీసీఐ కేంద్రాలకు వచ్చి వాహనాలను మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే అనుమతిస్తారు. ఈ సమయం దాటిన వాహనాలను మరుసటి రోజు కొనుగోలు చేస్తారు. 8 శాతం తేమ ఉంటనే మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521 చెల్లిస్తారు. 9 శాతం ఉంటే రూ.75 కోత విధిస్తారు. ఇలా 12 శాతం వరకు ఒక్కో శాతానికి రూ.75 కోత ఉంటుంది. 12 తేమ ఉన్న పత్తికి పాయింట్ రూ.75 చొప్పున రూ.150 తగ్గించి రూ.7,351 ఇస్తారు. తేమ విషయంలో రైతులకు కొంత మేర సడలింపు ఇవ్వాలని రైతు సంఘాల నాయకులు అధికారులకు సూచించినా ఫలితం లేకుండా పోయింది. సీసీఐ నిబంధనల ప్రకారం కొనుగోలు చేయడం జరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ ఏడాది పంట సేకరణ విషయంలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

తాంసి మండలంలోని బండలనాగాపూర్‌లో పత్తి తీస్తున్న రైతు

అన్నదాతకు మొండి'చేయి'

- రైతుభరోసా ఎగ్గొట్టిన కాంగ్రెస్ సర్కారు
- నేటికీ అందని పెట్టుబడి సాయం
- రుణమాఫీ అమలులోనూ ప్రభుత్వం విఫలం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు
- నేడు మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ నిరసనలు

నిర్మల్, అక్టోబర్ 19(నమస్తే తెలంగాణ) : ఎన్నికలకు ముందు అన్నదాతలను అక్కున చేర్చుకుని ఆదుకుంటామంటూ అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఆ తర్వాత ఇచ్చిన హామీలన్నీ బుట్టదాఖలు చేస్తూ రైతు కంట కన్నీరు నింపుతున్నది. అన్నదాతకు ఆపన్నహస్తం అందిస్తామని భరోసానిచ్చిన కాంగ్రెస్ ప్రస్తుతం అన్నింటా మొండిచేయి చూపుతున్నది. రాష్ట్రంలో అధికారం చేపట్టి పది నెలలు గడుస్తున్నప్పటికీ ఇంకా పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేదు. చాలా మంది రైతులకు రుణాలు మాఫీ కాక పోవడంతో పొలాలను విడిచి వ్యవసాయ అధికారులు, బ్యాంకుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి రుణమాఫీపై స్పష్టత లేకుండా పోయింది. ఒకవైపు రుణమాఫీపై గందరగోళం కొనసాగుతుండగానే మరోవైపు వానకాలం ముగిసినా, నేటికీ పెట్టుబడి సాయాన్ని అందించలేదు. తాము అధికారంలోకి రాగానే రైతుబంధు స్థానంలో రైతుభరోసా తీసుకొచ్చి ప్రతి రైతుకు ఎకరానికి రూ.15 వేలు ఇస్తామన్న హామీ హామీగానే మిగిలింది. వానకాలానికి సంబంధించి పంటలన్నీ చేతికొస్తున్న ప్రస్తుత తరుణంలో పెట్టుబడి సాయం అందక అన్నదాతలు అప్పులు చేసి మరీ సాగు చేశారు. రైతుభరోసాపై ప్రభుత్వం రోజుకో ప్రకటన చేస్తూ త్వరలోనే ఎకరానికి రూ.7,500 పెట్టుబడి సాయాన్ని ఇస్తామని చెప్పడంతో ఇప్పటికే పంట పెట్టుబడి కోసం చేసిన అప్పులను తీర్చుకోవచ్చని అన్నదాతలు ఆశించారు. అయితే ప్రస్తుతం సీజన్ ముగింపు దశకు చేరుకున్నప్పటికీ రైతుభరోసా విషయంలో ప్రభుత్వం నోరు మెదపడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతుభరోసాతోపాటు రుణమాఫీపై స్పష్టతనివ్వాలంటూ రైతులు చాలా చోట్ల అధికార పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులను నిలదీస్తున్నారు.

ఈ వ్యవహారం రోజురోజుకు ముదురుతుండడంతో రైతుల్లో ప్రభుత్వంపై ఆగ్రహం రెట్టింపవుతున్నది. ఈ నేపథ్యంలో రైతులకు ఇవ్వాల్సిన వానకాలం రైతుభరోసా ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకు నిరసనగా ఆదివారం అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. అన్నదాతలకు అండగా బీఆర్ఎస్ పార్టీ నిలవడంతో జిల్లాలో ఆదివారం జరిగే నిరసన కార్యక్రమాలు హోరెత్తనున్నాయి.

జిల్లా రైతులపై రూ.228కోట్ల భారం

వానకాలం సీజన్‌కు సంబంధించి పెట్టుబడి సాయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అందజేయక పోవడంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతులపై అప్పుల భారం పెరిగింది. గత కేసీఆర్ ప్రభుత్వం యేటా రెండు పంటలకు కలిపి ఎకరానికి రూ.10 వేల చొప్పున రంధనుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుబంధు స్థానంలో రైతు భరోసాను తీసుకొచ్చి ప్రతి రైతుకు ఎకరానికి రూ.15 వేలు అందిస్తామని ఇచ్చిన హామీ బుట్టదాఖలైంది. రూ.15 వేలు కాదుకదా రూ.10వేలు కూడా ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. గత యాసంగిలో అరకొర సాయాన్ని అందించిన ప్రభుత్వం.. వానకాలంలో నయా పైసా ఇవ్వకుండా రైతులను మోసం చేసింది. కేసీఆర్ ప్రభుత్వంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న 1,88,317మంది రైతులకు రూ.228 కోట్ల పెట్టుబడి సాయం అందింది. అంటే కాంగ్రెస్ సర్కారు పెట్టుబడి సాయం ఇవ్వకపోవడం వల్ల ఈ వానకాలంలో జిల్లా రైతులపై రూ.228 కోట్ల భారం పడినట్లేనని చెబుతున్నారు.

రుణమాఫీ కోసం ఎదురు చూపులు

జిల్లా వ్యాప్తంగా చాలా మంది రైతులకు రుణమాఫీ కాకపోవడంతో వారంతా తామేం పాపం చేశామంటూ సర్కారుపై దుమ్మెత్తి పోస్తున్నారు. రూ.2 లక్షల వరకు రైతు రుణాలన్నీ మాఫీ చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక అనేక ఆంక్షలు పెట్టడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 81,186 మంది రైతులు పంట రుణాలు తీసుకోగా, ఇప్పటి వరకు 64,742 మందికి రుణమాఫీ జరిగినట్లు అధికారులు చెబు తున్నారు. ఇంకా 16,444 మంది రైతులకు రుణమాఫీ జరగాలి. ఇప్పటి వరకు జిల్లాలో 79 శాతం మంది రైతులకే రుణమాఫీ కాగా, మిగతా రైతులు రుణమాఫీ కోసం కా ర్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మిగి లిన రైతులకు సంబంధించి ఇంకా రూ.350 కోట్ల వరకు ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉన్నదని అధికారులు చెబుతున్నారు. ఒక వైపు రుణమాఫీ కాకపోవడం, మరోవైపు రుణాలు రీ-షెడ్యూల్ కాక అన్నదాతల పరిస్థితి దయనీయంగా మారింది.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

నిరసన కార్యక్రమాన్ని సక్సెస్ చేయండి

మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, అక్టోబర్ 19 : మోసపూరిత హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని, దీంతో తెలంగాణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నదని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలం ఖండాల, అంకాపూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ నెల 24న ఆదిలాబాద్ పట్టణంలోని రామ్‌లీలా మైదానంలో చేపట్టే ఈ నిరసన కార్యక్రమంలో రైతులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ.. మోసపూరిత హామీలతో 420 నాయకులు అధికారంలోకి వచ్చారన్నారు. రైతులను ఆదివాసులను మోసం చేస్తూ ప్రజా సంక్షేమ పథకాలను కాలరాస్తున్నారు. ఆరు గ్యారెంటీల హామీలలో జాప్యం చేయడమే కాకుండా సంపూర్ణ రుణమాఫీ చేయకుండా రైతులను ఇక్కట్లు గురి చేస్తుంది అన్నారు. రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించడంలో పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. ప్రజలకు ఆరు గ్యారెంటీలు అందే వరకు ప్రజల పక్షాన బీఆర్ఎస్ ప్రభుత్వం పోరాడుతూనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గండ్రత్ రమేశ్, మెట్టు ప్రహ్లాద్, కుమ్ర రాజు, జగదీశ్, పరమేశ్వర్, రమణ, గంగయ్య, జంగు బాపు, సేడం లక్ష్మణ్, వసంత్, దేవదాస్, కడప మాధవరావు, బట్టు సతీశ్, కోస రవి, భీమ్‌రావు, సిడం లక్ష్మణ్ పాల్గొన్నారు.

నార్నూర్ ఉప మార్కెట్ యార్డులో సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి

గిట్టుబాటు ధర కల్పించాలి

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

నార్నూర్, అక్టోబర్ 19 : రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకు తనవంతు కృషి చేస్తానని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. నార్నూర్ మండల కేంద్రంలోని ఉపమార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులు, నాయకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అలాగే తాడిహత్నూర్ నుంచి గాదిగూడ మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా తయారైందని,త్వరలో పనులు ప్రారంభించేలా చూడాలన్నారు. ఉప మార్కెట్ కాకుండా నార్నూర్‌లోనే మార్కెట్‌ను ఏర్పాటు చేసేలా చూడాలని కోరారు. తర్వాత ఎమ్మెల్యే కోవలక్ష్మి మాట్లాడుతూ.. ప్రతి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానాన్ని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ ఆడే సురేశ్, ఇంద్రవెల్లి మార్కెట్ కార్యదర్శి దేవేందర్, వ్యవసాయ అధికారి ఆకాశ్, సీఈవో ఆడే గణేశ్, మాజీ ఎంపీపీ కనక మోతుబాయి, వైస్ మాజీ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ వైస్ మాజీ చైర్మన్ తోడసం నాగోరావ్, సర్పంచ్‌ల సంఘం మాజీ మండలాధ్యక్షుడు యుర్వేత రూప్‌దేవ్, మాజీ జడ్పీటీసీలు రూపావతి జ్ఞానో బాపుష్కర్, హేమల బ్రిజ్జిలాల్, మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్, నాయకులు మెస్రం హన్మంత్‌రావ్, లోకండే దేవ్‌రావ్, జాదవ్ రెడ్డినాయక్, చంద్రశేఖర్, రూప్‌దేవ్, శ్రీరామ్, మానిక్‌రావ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్

సమన్వయంతో పని చేయాలి

ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్

బాసర, అక్టోబర్ 19 : అధికారులు సమన్వయంతో పని చేయాలని ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ అన్నారు. శనివారం ఆర్జీయూకేటీ అడ్మినిస్ట్రేటివ్ సెక్షన్ అధికారులు, 13 విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అకాడమిక్, ఎగ్జామినేషన్ సెక్షన్, వాటర్, ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్, ప్రొక్యూర్మెంట్, నెట్‌వర్కింగ్ అండ్ సాఫ్ట్‌వేర్ సెక్షన్ అధికారులు తమ నివేదికలను అందజేశారు. ఈ నివేదికల ఆధారంగా విశ్వవిద్యాలయ పరిధిలో చేపట్టాల్సిన పనులు, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ.. సాంకేతిక పోటీ ప్రపంచంలో సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు విద్యార్థులను సిద్ధం చేయాలని సూచించారు. సెల్ఫ్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అనే నినాదాన్ని విద్యార్థులలో తీసుకెళ్లాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందని తెలిపారు. క్యాంపస్ సెంటర్ సమగ్ర నివేదిక ఆధారంగా తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రస్తావించారు.

అమ్మవారిని దర్శించుకున్న ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీ

ఇటీవలే బాసర ఆర్జీయూకేటీ ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు తీసుకున్న గోవర్ధన్ శనివారం బాసర సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనను అధికారులు, అర్చకులు స్వాగతించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈయన వెంట ట్రిపుల్ ఐటీ అధికారులు, ఆలయాధికారులున్నారు.

ప్రసూతి మరణాలను తగ్గించేందుకు చర్యలు

కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 19 : ప్రసూతి మరణాలు తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. నిర్మల్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం సంబంధిత శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. గర్భిణులకు పరీక్షలు నిర్వహిస్తూ రక్తహీనత, పోషకాహార లోపాలను గుర్తించి అవసరమైన వారికి ఐరన్, కాల్షియం మాత్రలు అందించాలన్నారు. పోషకాహారంపై గర్భిణుల్లో అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఏఎన్ఎం, ఆశ, అంగన్‌వాడీ టీచర్లతో గర్భిణులకు మానసిక ఆరోగ్యంపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. హైరిస్క్ కేసులు ఉన్న గర్భిణులను గుర్తించి అవసరమైన చికిత్సను అందించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఆసుపత్రుల వద్ద కట్టుదిట్టమైన భద్రతను కొనసాగించాలన్నారు. సీసీ కెమెరా నిఘాలో పర్యవేక్షణ చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు నమోదైన డెంగ్యూ, ఇతర విష జ్వరాలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి రాజేందర్, వైద్యాధికారులు సురేశ్, సౌమ్య పాల్గొన్నారు.

దేవాలయాల రక్షణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామ్ శర్మ

ఎదులాపురం, అక్టోబర్ 19 : తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల రక్షణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం చెందని విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామ్ శర్మ అన్నారు. ఆలయాల రక్షణకు ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తు, ఇటీవల సికింద్రాబాద్‌లో అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా శనివారం వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అంతకుముందు స్థానిక శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో హనుమాన్ చాలీసా పారాయణం గావించి, మోటార్ బైక్ ర్యాలీ ద్వారా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా విశ్వహిందు పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామ్ శర్మ మాట్లాడుతూ... హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులు ఆందోళన కలిగిస్తున్నాయని, ఆలయాల రక్షణకు ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం హిందూ దేవాలయాల రక్షణలో విఫలం చెందిందని అన్నారు. సికింద్రాబాద్ లో అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని, హిందూ దేవాలయాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. నిరసన అనంతరం కలెక్టర్ రాజర్షి షాకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బజరంగ్‌దల్ జిల్లా సంయోజక్ బండారి సంతోష్, పట్టణ అధ్యక్షుడు సంతోష్ ఠాకూర్, హిందూ వాయిని ప్రతినిధి స్వప్న, వీహెచ్‌పీ పట్టణ అధ్యక్షుడు దిలీప్ వైద్య, బేల మండల అధ్యక్షుడు నారాయణ, నవీన్, దశరథ్ పటేల్ పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోండి

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 19 : హిందూ ఆలయాలపై దాడులు నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు విఠల్ మాట్లాడుతూ.. దేశంలో హిందువులపై, హిందూ పండుగలు, హిందూ ఆలయాలపై నిత్యం ఎక్కడో ఒకచోట దాడులు జరుగుతున్నాయని, ఇటీవల హైదరాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయంను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేస్తుంటే సీఎం కనీసం స్పందించకపోవడం సిగ్గు చేటని అన్నారు. దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో మూర్తి ప్రభాకర్, పతికె రాజేందర్, శ్రీనివాస్, శ్రీవాణి, బ్యాగరి సిరి, రవి, నరేందర్, నరేష్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విశ్వ హిందూ పరిషత్ సభ్యులు